# ప్రశాంతి నిలయంలో రాజ్‌నాథ్ సింగ్, చంద్రబాబు ప్రత్యేక దర్శనం

**- సత్యసాయి సేవా కార్యక్రమాలను ప్రశంసించిన ప్రముఖులు**



**పుట్టపర్తి,మే15.అక్షర టైమ్స్:** కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ శుక్రవారం ప్రశాంతి నిలయాన్ని సందర్శించారు. ప్రముఖ నాయకుల రాకతో ప్రశాంతి నిలయం పరిసరాలు సందడిగా మారాయి. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ట్రస్టీలు ఐఎస్ఎన్ ప్రసాద్ (ఐఏఎస్ రిటైర్డ్), మనోహర్ శెట్టి, కర్ణాటక మాజీ ప్రధాన కార్యదర్శి వందితా శర్మలు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం భగవాన్ శ్రీ సత్యసాయి బాబా దర్శనం అనంతరం ట్రస్టీలతో ప్రముఖులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వైద్య సేవలు, విద్యా సేవలు, గ్రామీణాభివృద్ధి, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల గురించి ట్రస్టీలు వివరించారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా బోధించిన నిస్వార్థ సేవా తత్వాన్ని ఆధారంగా చేసుకుని ప్రజలకు అందిస్తున్న సేవలను నాయకులు అభినందించారు. పేదలకు ఉచిత వైద్యం, విద్య అందించడంలో శ్రీ సత్యసాయి సంస్థలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
అనంతపురము జిల్లా / శ్రీ సత్యసాయి జిల్లా

# పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన

**- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్,సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం**

**- రూ.15 వేల కోట్ల పెట్టుబడులు.. 7,500 మందికి ఉద్యోగావకాశాలు**

**- పుట్టపర్తి దేశ రక్షణ శక్తి కేంద్రంగా అవతరిస్తుందన్న సీఎం చంద్రబాబు**









**పుట్టపర్తి,మే15.అక్షర టైమ్స్:** శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి దేశ రక్షణ రంగ చరిత్రలో మరో కీలక ఘట్టానికి వేదికైంది. అత్యాధునిక యుద్ధ విమానాల తయారీ, పరీక్షల కోసం ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) ఇంటిగ్రేషన్ అండ్ ఫ్లైట్ టెస్టింగ్ ప్రాజెక్టుకు శుక్రవారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అమలు కానున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు శిలాఫలకాన్ని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు.ఇదే కార్యక్రమంలో కల్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హెచ్ఎఫ్‌సీఎల్‌కు సంబంధించిన అనుబంధ రక్షణ ప్రాజెక్టుల శిలాఫలకాలను వర్చువల్‌గా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, రక్షణ శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

### పుట్టపర్తి నుంచి రక్షణ రంగానికి కొత్త దిశ

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ పుట్టపర్తి ఇప్పటివరకు ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, ఇకపై దేశ రక్షణ రంగంలోనూ కీలకమైన వ్యూహాత్మక కేంద్రంగా నిలవబోతోందని పేర్కొన్నారు. సత్యసాయి బాబా బోధనలు ప్రపంచ శాంతికి మార్గదర్శకంగా నిలిచాయని, అదే నేలపై దేశ భద్రతకు సంబంధించిన అత్యాధునిక రక్షణ ప్రాజెక్టు రావడం చారిత్రాత్మకమన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టు ద్వారా అత్యాధునిక స్టెల్త్ యుద్ధ విమానాల అభివృద్ధి, సమీకరణ, పరీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. భారత రక్షణ రంగాన్ని స్వావలంబన దిశగా తీసుకెళ్లే ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి ఈ ప్రాజెక్టు బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు. దేశ భద్రతను మరింత పటిష్ఠం చేయాలన్న లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ పనిచేస్తున్నారని, ఆ దిశలో ఆంధ్రప్రదేశ్‌కు ఈ భారీ ప్రాజెక్టు రావడం గర్వకారణమన్నారు.

### 36 రోజుల్లో అనుమతులు పూర్తి

ఇంత భారీ ప్రాజెక్టును అత్యంత వేగంగా అమలు దశకు తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని సీఎం తెలిపారు. కేవలం 36 రోజుల్లోనే అన్ని అనుమతులు పూర్తి చేసి శంకుస్థాపన దశకు తీసుకురావడం ప్రభుత్వ సామర్థ్యానికి నిదర్శనమన్నారు. "జెట్ స్పీడ్‌తో అనుమతులు ఇచ్చాం" అని వ్యాఖ్యానించారు.ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర రక్షణ శాఖ, కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఏపీ పరిశ్రమలకు అనుకూల రాష్ట్రంగా ఎదుగుతోందని, రక్షణ రంగ పెట్టుబడులకు రాష్ట్రం ప్రధాన కేంద్రంగా మారబోతోందన్నారు.

### రూ.15 వేల కోట్ల పెట్టుబడులు

ఏఎంసీఏ ప్రాజెక్టు ద్వారా రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయని సీఎం వెల్లడించారు. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7,500 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్, ఫ్లైట్ టెస్టింగ్ వంటి అత్యున్నత సాంకేతిక కార్యకలాపాలు పుట్టపర్తిలోనే జరగనున్నాయని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో పాటు మరిన్ని ఏరోస్పేస్, డిఫెన్స్ రంగ పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. భారత్ ఫోర్జ్, కల్యాణి గ్రూప్, హెచ్ఎఫ్‌సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి సంస్థలు రాష్ట్రంలో తమ కార్యకలాపాలు విస్తరించనున్నాయని పేర్కొన్నారు.

### డ్రోన్ల తయారీలోనూ ఏపీ ముందంజ

ఇటీవల ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాల్లో డ్రోన్ల ప్రాధాన్యం గణనీయంగా పెరిగిందని చంద్రబాబు అన్నారు. వ్యవసాయం, వైద్యం, భద్రత, పరిశ్రమలు వంటి అనేక రంగాల్లో డ్రోన్ల వినియోగం విస్తరిస్తోందన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో వినియోగించిన డ్రోన్లు ఆంధ్రప్రదేశ్‌లో తయారై పరీక్షించబడిన విషయాన్ని గుర్తుచేశారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి డ్రోన్ తయారీ, పరిశోధన, శిక్షణ కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాబోయే కాలంలో డ్రోన్ టెక్నాలజీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. దేశ రక్షణలో ఏపీ కీలక కేంద్రం"శ్రీహరికోట అంతరిక్ష శక్తి... నాగాయలంక క్షిపణి శక్తి... పుట్టపర్తి రక్షణ శక్తి... విశాఖ నౌకాదళ శక్తి"గా దేశ భద్రతకు ఆంధ్రప్రదేశ్ ప్రధాన అండగా నిలుస్తుందని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో రక్షణ, అంతరిక్ష, నౌకాదళ రంగాలకు సంబంధించిన సమగ్ర ఎకోసిస్టమ్ ఏర్పడుతోందన్నారు.

### రాయలసీమ అభివృద్ధికి ప్రాధాన్యం

రాయలసీమ గతంలో రతనాల సీమగా పేరుగాంచిందని, కాలక్రమేణా కరవు సమస్యలతో వెనుకబడిందని చంద్రబాబు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయలసీమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించేలా కార్యాచరణ చేపట్టామని తెలిపారు.కియా పరిశ్రమకు నీటి సరఫరా చేసినట్లు గుర్తుచేస్తూ, రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు లక్ష కోట్ల రూపాయల ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. పరిశ్రమలు, వ్యవసాయం, సాంకేతిక రంగాల సమన్వయంతో రాయలసీమ రూపురేఖలు మారుస్తామని వెల్లడించారు.

## పుట్టపర్తిని దేశ రక్షణ రంగంలో కీలక కేంద్రంగా తీర్చిదిద్దుతాం : మంత్రి లోకేష్






**పుట్టపర్తి,మే15.అక్షర టైమ్స్:** శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి దేశ రక్షణ రంగంలో కీలక కేంద్రంగా ఎదగబోతోందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఏరోనాటికల్ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న ఆధునిక మధ్యశ్రేణి యుద్ధ విమానాల సమీకరణ, విమాన పరీక్షల ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. సభలో కొద్దిసేపు హిందీలో మాట్లాడిన మంత్రి లోకేష్ అందరినీ ఆకట్టుకున్నారు. రాయలసీమలో భారీ రక్షణ రంగ పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు. ఎన్నో దశాబ్దాలుగా కరవుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ ప్రాంతానికి ఇప్పుడు పారిశ్రామిక అభివృద్ధి రూపంలో కొత్త ఆశలు కనిపిస్తున్నాయన్నారు. గతంలో ఆటోమొబైల్ పరిశ్రమలను తీసుకువచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు రక్షణ రంగ ప్రాజెక్టులను కూడా రాష్ట్రానికి తీసుకొస్తోందని చెప్పారు.పుట్టపర్తిలో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్టులో ఐదో తరం ఆధునిక యుద్ధ విమానాల సమీకరణ, సాంకేతిక పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనివల్ల దేశ రక్షణ సామర్థ్యం మరింత పెరగడంతో పాటు రాయలసీమకు అంతర్జాతీయ గుర్తింపు వస్తుందని అభిప్రాయపడ్డారు.ఈ ప్రాజెక్టు చుట్టూ అనుబంధ పరిశ్రమలు కూడా ఏర్పడి వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు.ఈ ప్రాజెక్టు సాధన వెనుక కూటమి ప్రభుత్వ కృషి ఉందని మంత్రి పేర్కొన్నారు. ఢిల్లీలో కేంద్ర రక్షణ మంత్రిని కలిసి ప్రాజెక్టును రాష్ట్రానికి కేటాయించాలని కోరినట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం వేగంగా భూముల కేటాయింపు, అనుమతుల ప్రక్రియ పూర్తి చేసి ప్రాజెక్టు అమలుకు సహకరించిందన్నారు. తక్కువ సమయంలోనే కార్యరూపం దాల్చిన ఈ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ప్రధాని నరేందర్ మోడీ కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి కొనియాడారు. దేశ గౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిలబెట్టే నాయకత్వం ప్రస్తుతం దేశానికి లభించిందన్నారు. రక్షణ రంగంలో భారత్ శక్తిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.శ్రీ సత్యసాయి బాబా దూరదృష్టితో పుట్టపర్తిలో నిర్మించిన విమానాశ్రయాన్ని ఒకప్పుడు చాలామంది ప్రశ్నించారని, ఇప్పుడు అదే ప్రాంతం దేశ రక్షణ రంగానికి ప్రధాన కేంద్రంగా మారుతోందని మంత్రి గుర్తుచేశారు. బాబా ఆశయాలకు అనుగుణంగానే అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.రాష్ట్రానికి భారీ పెట్టుబడులు ఆకర్షించడంలో ప్రభుత్వం విజయవంతమైందని, వివిధ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ముందుకొస్తున్నాయని చెప్పారు. రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలు విస్తరిస్తుండటంతో యువతకు కొత్త అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు.కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి వెల్లడించారు. అభివృద్ధి వికేంద్రీకరణ లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రక్షణ రంగంతో పాటు విద్య, సాంకేతిక, పారిశ్రామిక రంగాల్లో కూడా రాష్ట్రాన్ని ముందంజలో నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ ప్రాజెక్టు కేవలం రక్షణ రంగానికే పరిమితం కాకుండా రాయలసీమ భవిష్యత్తును మార్చే అభివృద్ధి యజ్ఞమని మంత్రి లోకేష్ అభివర్ణించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం, రాష్ట్రం కలిసి పనిచేస్తున్నాయని, భవిష్యత్తులో మరిన్ని భారీ ప్రాజెక్టులు రాష్ట్రానికి తీసుకొస్తామని వెల్లడించారు.

# దేశ ఏరోస్పేస్ రంగానికే గేమ్ ఛేంజర్ ఈ ప్రాజెక్ట్ : ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి







**పుట్టపర్తి,మే15.అక్షర టైమ్స్:** భారతదేశ ఏరోస్పేస్ మరియు రక్షణ తయారీ రంగంలో పుట్టపర్తి ప్రత్యేక గుర్తింపు సాధించే దిశగా ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అభిప్రాయపడ్డారు.పుట్టపర్తి సమీపంలోని బ్రాహ్మణపల్లి వద్ద ప్రతిష్ఠాత్మక అడ్వాన్స్డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ రక్షణ ప్రాజెక్టుకు గురువారం శంకుస్థాపన జరిగింది. కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాజెక్టు పుట్టపర్తి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టమని పేర్కొన్నారు. సత్యసాయి బాబా ఆశీస్సులతో ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందిన పుట్టపర్తి, ఇకపై సాంకేతిక మరియు రక్షణ రంగాల కేంద్రంగా ఎదగబోతుందని తెలిపారు. ఎన్నో ఏళ్ల క్రితమే ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటు కావడం, ఇప్పుడు రక్షణ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో భారీ ప్రాజెక్టు రావడం గర్వకారణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సుమారు 650 ఎకరాల్లో ఈ తయారీ కేంద్రం ఏర్పాటవుతోందని చెప్పారు. ఇందులో స్వదేశీ సాంకేతికతతో ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానాలు, అడ్వాన్స్డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు ఉండబోతుందన్నారు.ఈ ప్రాజెక్టుతో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఏరోస్పేస్, ఇంజినీరింగ్ సేవలు, పరిశోధన, సమాచార సాంకేతికత, రవాణా, అతిథ్య రంగాల్లో అవకాశాలు విస్తరించనున్నాయని చెప్పారు. పుట్టపర్తి ప్రాంతంలో మౌలిక సదుపాయాలు గణనీయంగా అభివృద్ధి చెందనున్నాయని, స్థానిక వ్యాపారాలు, హోటల్ రంగాలకు కూడా ఊతమిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టును రాష్ట్రానికి కేటాయించిన కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకువస్తున్నారని కొనియాడారు.

## పెంచిన పెట్రోల్,డీజిల్ ధరలను ఉపసంహరించుకోవాలి : సిపిఎం నాయకులు డిమాండ్



**కళ్యాణదుర్గం,మే15.అక్షర టైమ్స్:** కళ్యాణదుర్గం పట్టణంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ సిపిఎం ఆధ్వర్యంలో పెరిగిన పెట్రోల్,డీజిల్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలియజేసిన సిపిఎం నాయకులు ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ఓ వైపు తీవ్రమైన అధిక భారాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరో వైపు కేంద్ర ప్రభుత్వం గ్యాస్, డిజీల్ ,పెట్రోల్ ధరలను పెంచుతూ ప్రజలపై భారాన్ని వెస్తున్నది దింతో సామాన్య ప్రజలపై అన్ని రకాలుగా ధరలు పెరిగిపోయాయి నిత్యావసర సరుకులు కొనే పరిస్థితులు లేక ప్రజలు అధికంగా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు,దేశంలో ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే ఈ నిర్ణయం తీసుకోవడం భాదాకరం అందుకు నిరసనగా నేడు జిల్లా వ్యాప్తంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెంచిన ధరలను తగ్గించాలని కోరుతూ నిరసనలు తెలియజేస్తున్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న భారాలను ప్రజలందరూ వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేస్తున్నాం అలాగే జిల్లాలో వందలాది గ్రామాలకు త్రాగునీరు అందిచే సత్యసాయి కార్మికులు సమ్మె పదకొండు రోజులకి చేరుకుంది ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని,బడ్జెట్ లో సత్యసాయి త్రాగునీటి పథకం కు నిధులు కేటాయించాలని సిపిఎం పార్టీగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం,కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తిప్పానాయక్,ఎస్సీ ఎస్టీ జేఏసి అధ్యక్షుడు చెలిమప్ప,వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు ప్రకాష్ ,సిఐటియూ కార్యదర్శి రంగనాథ్, సత్యసాయి త్రాగునీటి యూనియన్ నాయకులు వన్నూరప్ప,తిప్పేస్వామి,రాధాకృష్ణ,భవిత్,హనుమంతరాయుడు,నగేష్,వెంటేశులు,గంగన్న,పరంధామ,ఎర్రస్వామి,శివన్న కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత షూటింగ్ బాల్ వేసవి శిక్షణ శిబిరం..

**- శ్రీ సత్య సాయి జిల్లా షూటింగ్ బాల్స్ అసోసియేషన్**




**ధర్మవరం,మే15.అక్షర టైమ్స్:** గత 2 సంవత్సరాల నుండి శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నందు పట్టణంలోనే ఏకైక షూటింగ్ బాల్స్ సమ్మర్ క్యాంపు,రెగ్యులర్ ప్రాక్టీస్, నిర్వహించినటువంటి సత్యసాయి జిల్లాకు చెందినటువంటి ఎంతోమంది క్రీడాకారులను జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా తీర్చు దిద్దుటకు నిరంతరం కృషి చేస్తున్న సత్యసాయి జిల్లా అసోసియేషన్ సెక్రటరీ జింక ఉదయ్ కిరణ్, స్థానిక అసోసియేషన్ అధ్యక్షులు సి. శీను ,కోశాధికారి బి. మోహన్ కోచ్‌లు ,వీరా, మణికంఠ,షేక్షావలి,సీనియర్ క్రీడాకారుల సౌజన్యంతో ఉచితంగా ఉదయం సాయంత్రం ఉచిత షూటింగ్ బాల్స్ శిక్షణ అందిస్తున్నారు. ఈ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ధర్మవరం పట్టణ ప్రజలు పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని వారు తెలిపారు.

